09-04-2021 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

" మధురమైన పిల్లలారా - తండ్రి సమానము లవ్‌లీ(అత్యంత ప్రియం)గా తయారయ్యేందుకు స్వయాన్ని ఆత్మ బిందువుగా భావించి బిందువైన తండ్రిని స్మృతి చేయండి. "

ప్రశ్న:- స్మృతిలో ఉండేందుకు గుప్తమైన, తీవ్రమైన పరిశ్రమను ప్రతి పుత్రుడూ చేయాలి, ఎందుకు?

జవాబు :- ఎందుకంటే స్మృతి చేయకుంటే ఆత్మ పాపాత్మ నుండి పుణ్యాత్మగా అవ్వలేదు. గుప్త స్మృతిలో ఉండి దేహీ-అభిమానులుగా అయినప్పుడే వికర్మలు వినాశమౌతాయి. ధర్మరాజు శిక్షల నుండి తప్పించుకునే సాధనం కూడా బాబా స్మృతియే. స్మృతిలోనే మాయా తుఫాన్లు విఘ్నాలను కలిగిస్తాయి. అందువలన స్మృతి చేసేందుకు గుప్త శ్రమ చేయండి. అప్పుడే లక్ష్మీనారాయణుల వలె లవ్‌లీగా తయారవ్వగలరు.

పాట :- ఓం నమః శివాయః ....

ఓంశాంతి. ఈ మహిమ అందరి తండ్రిది. భగవంతుడు అనగా తండ్రిని స్మృతి చేస్తారు. వారిని తల్లి-తండ్రి(మాత-పిత) అని అంటారు కదా. గాడ్‌ఫాదర్ అని కూడా అంటారు. మనుష్యులెవ్వరినీ గాడ్‌ఫాదర్ అని అనరు. లౌకిక తండ్రిని కూడా బాబా లేక తండ్రి అని అంటారు. లౌకిక తండ్రి అని ఎవరిని అంటారో వారు కూడా పారలౌకిక తండ్రినే స్మృతి చేస్తారు. వాస్తవానికి స్మృతి చేసేది ఆత్మ, లౌకిక తండ్రిని స్మృతి చేసేది కూడా ఆత్మయే. కాని ఆత్మలకు తమ రూపము, కర్తవ్యాల గురించి తెలియదు. ఆత్మ స్వయం గురించే తెలుసుకోకుంటే గాడ్‌ఫాదర్‌ను ఎలా తెలుసుకుంటుంది! తమ-తమ లౌకిక తండ్రి గురించి అయితే అందరికీ తెలుసు. అతని నుండి వారసత్వము లభిస్తుంది, లేకుంటే ఎందుకు స్మృతి చేస్తారు! పారలౌకిక తండ్రి ద్వారా కూడా వారసత్వము తప్పకుండా లభిస్తూ ఉంటుంది. "ఓ గాడ్ ఫాదర్" అని అంటారు. వారి నుండి దయ, క్షమ కోరుతుంటారు ఎందుకనగా పాపాలు చేస్తూ ఉంటారు. ఇది కూడా డ్రామాలో నిర్ణయించబడి ఉంది. కాని ఆత్మను గురించి, పరమాత్మను గురించి తెలుసుకోవడం చాలా కష్టమైన(డిఫికల్ట్) విషయము. సులభములో సులభమే కాక కష్టములో కష్టమైనది. భలే సైన్స్(విజ్ఞానము) ఎంతగా నేర్చుకొని చంద్రుని వరకు వెళ్ళగలిగినా ఈ(మహా) జ్ఞానము ముందు అది తుచ్ఛమైనది. స్వయాన్ని మరియు తండ్రిని తెలుసుకోవడం చాలా కష్టము. బి.కెలు అని పిలవబడుతున్న పిల్లలు కూడా మొదట స్వయాన్ని ఆత్మ అని నిశ్చయం చేసుకోవాలి. నేను ఆత్మ బిందువును, మా తండ్రి కూడా బిందువే - ఈ విషయాలు మర్చిపోతారు. ఇది కష్టమైన సబ్జెక్ట్. స్వయాన్ని ఆత్మ అని మర్చిపోతే తండ్రిని స్మృతి చేయడం కూడా మర్చిపోతారు. దేహీ-అభిమానులుగా అయ్యే అభ్యాసము లేదు. ఆత్మ ఒక బిందువు. అందులోనే 84 జన్మల పాత్ర నిండి ఉంది. ఆత్మనైన నేను భిన్న-భిన్న శరీరాలను తీసుకొని పాత్ర చేస్తున్నాననే విషయాన్ని మాటిమాటికి మర్చిపోతారు. ముఖ్యముగా ఈ విషయాన్నే అర్థము చేసుకోవాలి. ఆత్మ - పరమాత్మలను గూర్చి అర్థం చేసుకోవడం తప్ప మిగిలిన జ్ఞానమంతా అందరి బుద్ధిలో సహజంగా వస్తుంది. మనము 84 జన్మలు తీసుకుంటాము, సూర్యవంశీయులుగా, చంద్రవంశీయులుగా..... అవుతాము. ఈ చక్రమైతే చాలా సులభమైనది. అంతా అర్థము చేసుకుంటారు. కాని స్వయాన్ని ఆత్మగా నిశ్చయం చేసుకొని తండ్రిని స్మృతి చేయుటలో ఉన్నంత లాభం కేవలం చక్రాన్ని గుర్తు చేసుకొనుటలో లేదు. నేను ఆత్మను,

ఒక నక్షత్రాన్ని, తండ్రి కూడా సూక్ష్మమైన నక్షత్రమే. వారే సద్గతిదాత, వారిని స్మృతి చేయడం వలన వికర్మలు(పాప కర్మలు) వినాశనమైపోతాయి. ఈ పద్ధతితో ఎవ్వరూ నిరంతరం స్మృతి చేయడం లేదు. ఆత్మాభిమానులుగా అవ్వరు. నేను ఆత్మ అని ప్రతి క్షణము గుర్తుండాలి. నన్ను స్మృతి చేస్తే వికర్మలు వినాశనమౌతాయని తండ్రి ఆజ్ఞాపించారు. నేను ఒక బిందువును. ఇక్కడకు వచ్చి పాత్రధారిగా అయ్యాను. నాపై పంచ వికారాల తుప్పు ఏర్పడి ఉంది, ఇనుప యుగంలో ఉన్నాను. ఇప్పుడు బంగారు యుగంలోకి వెళ్ళాలి. అందువలన తండ్రిని చాలా ప్రేమగా స్మృతి చేయాలి. ఈ విధంగా తండ్రిని స్మృతి చేస్తే తుప్పు వదిలిపోతుంది. ఇందులోనే శ్రమ ఉంది. సేవను గురించి ఉబ్బించే కబుర్లు (సంతోషపరచే వార్తలు) చాలా చెప్తూ ఉంటారు. ఈ రోజు ఈ సేవ చేశాను, చాలా ప్రభావితమయ్యారు అని చెప్తూ ఉంటారు. కాని ఆత్మ-పరమాత్మల జ్ఞానము గురించి వారు ఏ మాత్రము ప్రభావితమవ్వలేదని శివబాబాకు తెలుసు. భారతదేశము స్వర్గంగా ఉండేది కాని నరకంగా ఎలా తయారౌతుంది, 84 జన్మలు ఎలా తీసుకుంటారు. సతో, రజో, తమోలోకి ఎలా వస్తారు కేవలం ఇది విని ప్రభావితమౌతారు. పరమాత్మ నిరాకారుడని కూడా అర్థము చేసుకుంటారు కాని నేను ఆత్మను, నాలో 84 జన్మల పాత్ర నిండి ఉంది. బాబా కూడా బిందువే, వారిలో పూర్తి జ్ఞానమంతా ఉంది. వారిని స్మృతి చేయాలి. ఈ ముఖ్యమైన విషయాలు ఎవ్వరూ అర్థము చేసుకోరు. ప్రపంచ చరిత్ర-భూగోళాల జ్ఞానము తండ్రి ఒక్కరు మాత్రమే ఇస్తారు. ప్రపంచ చరిత్ర-భూగోళాలు ఉండాలని ప్రభుత్వము వారు కూడా కోరుచున్నారు. ఇవి దాని కంటే సూక్ష్మమైన విషయాలు. ఆత్మ అంటే ఏమి, అందులో 84 జన్మల పాత్ర అవినాశిగా ఎలా ఉందో అర్థము చేసుకోవాలి. ఇది గుర్తు చేసుకుంటూ ఉండాలి. స్వయాన్ని బిందువుగా భావించి తండ్రిని స్మృతి చేయాలి. దీని ద్వారా వికర్మలు వినాశనమవుతాయి. ఈ యోగంలో ఎవ్వరూ తత్పరులుగా లేరు. ఈ స్మృతిలో ఉంటే చాలా లవ్‌లీగా అవుతారు. ఈ లక్ష్మీనారాయణులు ఎంత ప్రియంగా ఉన్నారో చూడండి, ఇక్కడ మనుష్యులు ఎలా ఉన్నారో గమనించండి. స్వయాన్ని గురించి - మాలో ఏ గుణాలు లేవు, మేము దుర్మార్గులము, అనాగరికులము, మీరు చాలా స్వచ్ఛమైనవారని వారే అంటారు. స్వయాన్ని ఆత్మగా నిశ్చయము చేసుకొని తండ్రిని స్మృతి చేస్తే సఫలత లభిస్తుంది లేకపోతే సఫలత చాలా కొద్దిగా లభిస్తుంది. మాలో చాలా మంచి జ్ఞానముందని భావిస్తారు. ప్రపంచ చరిత్ర-భూగోళము మాకు తెలుసునని అంటారు కాని యోగము యొక్క చార్టును చూపించరు. స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేయువారు, ఈ స్థితిలో ఉండువారు ఎవరో ఒక్కరు అరుదుగా ఉన్నారు. చాలామందికి ఈ అభ్యాసము లేదు. పిల్లలు కేవలం జ్ఞాన చక్రాన్ని త్రిప్పుతూ ఉంటారని బాబాకు తెలుసు. పోతే నేను ఆత్మను, బాబాతో యోగము జోడించాలి. దీని వలన ఇనుప యుగము నుండి బంగారు యుగంలోకి వెళ్తాము, ఆత్మనైన నేను తండ్రిని తెలుసుకోవాలి, వారి స్మృతిలోనే ఉండాలి. ఈ అభ్యాసము చాలా మందికి తక్కువగా ఉంది. చాలా మంది రాను కూడా వస్తారు. బాగుంది, బాగుంది అని కూడా అంటారు, కాని లోపల ఎంత తుప్పు ఏర్పడి ఉందో వారికి తెలియదు. సుందరము(పవిత్రము) నుండి శ్యామ్(అపవిత్రంగా) అయిపోయారు. మళ్ళీ సుందరంగా ఎలా అవ్వాలి? ఈ విషయాలు ఎవ్వరికీ తెలియదు. కేవలం చరిత్ర - భూగోళాలను తెలుసుకోవడం కాదు. పావనంగా ఎలా తయారవ్వాలి? అని తెలుసుకోవాలి. "**శిక్షలు అనుభవించకుండా ఉండు ఉపాయం - కేవలం స్మృతిలో ఉండాలి.**" యోగము సరిగ్గా లేకుంటే ధర్మరాజు ద్వారా చాలా శిక్షలు అనుభవిస్తారు. ఇది చాలా పెద్ద సబ్జెక్ట్. దీనిని ఎవ్వరూ పూర్తిగా

తీసుకోలేరు. జ్ఞానమంతా నాకే తెలుసు అని కూర్చుంటారు. ఇందులో అనుమానాలు ఏవీ లేవు. ముఖ్యమైనది యోగము. యోగములో చాలా మంది కచ్చాగా ఉన్నారు. అందువలన తండ్రి అంటున్నారు - జాగరూకతతో వ్యవహరించండి. కేవలం పండితులుగా అవ్వకండి. నేను ఆత్మను, నేను తండ్రిని స్మృతి చేయాలి. తండ్రి ఆజ్ఞాపించారు - " మన్మనాభవ " - ఇది మహామంత్రము. స్వయాన్ని నక్షత్రంగా భావించి, తండ్రిని కూడా నక్షత్రంగా భావించి తండ్రిని స్మృతి చేయండి. తండ్రిని స్మృతి చేసినప్పుడు పెద్ద రూపమేదీ ముందుకు రాదు(గుర్తు రాదు). కావున దేహీ-అభిమానులుగా అవ్వడంలోనే శ్రమ ఉంది. విశ్వమహారాజ - విశ్వమహారాణిగా ఒక్కరే అవుతారు, వారి ప్రజలు లక్షల మంది తయారౌతారు. ప్రజలు చాలామంది ఉంటారు కదా. చరిత్ర-భూగోళాలు తెలుసుకోవడం చాలా సులభము. కాని స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేసినప్పుడే పావనంగా అవుతారు. ఈ అభ్యాసము చాలా కష్టమైనది. స్మృతి చేసేందుకు కూర్చుంటే చాలా తుఫానులు వచ్చి విఘ్నాలు కలిగిస్తాయి. అర్ధగంట ఏకరస స్థితిలో కూర్చోవడం కూడా చాలా కష్టము. క్షణ-క్షణము మర్చిపోతూ ఉంటారు. ఇందులోనే సత్య-సత్యమైన గుప్తమైన శ్రమ ఉంది. చక్ర రహస్యాన్ని తెలుసుకోవడం చాలా సులభము. కాని దేహీ-అభిమానులుగా అయి తండ్రిని స్మృతి చేయడం కష్టము. ఇందులో కొంతమంది మాత్రమే అతి కష్టంగా తెలుసుకొని స్మృతి చేస్తారు. తండ్రి స్మృతి ద్వారానే మీరు పావనంగా అవుతారు. నిరోగి శరీరము, సుదీర్ఘ ఆయువు లభిస్తుంది. కేవలం ప్రపంచ చరిత్ర - భూగోళాలను తెలిపించడం వలన మాలలోని మణులుగా అవ్వలేరు. స్మృతి ద్వారా మాత్రమే మణిగా అవుతారు. ఈ శ్రమను ఎవ్వరూ చేయలేకుండా ఉన్నారు. స్మృతిలో ఉండడం లేదని స్వయం కూడా అర్థము చేసుకుంటారు. మంచి మంచి మహారథులు కూడా ఈ విషయంలో బలహీనంగా ఉన్నారు. ముఖ్యమైన విషయాన్ని అర్థము చేయించడం రానే రాదు. ఈ విషయం కష్టమైనదే. కల్పము ఆయువును వారు చాలా పెద్దదిగా చేసేశారు. మీరు 5 వేల సంవత్సరాలని ఋజువు చేస్తారు కాని ఆత్మ - పరమాత్మల రహస్యాన్ని కొంచెము కూడా తెలుసుకోరు. స్మృతే చేయరు. అందువలన స్థితి హెచ్చు-తగ్గులు అవుతూ ఉంటుంది. దేహాభిమానము చాలా ఎక్కువగా ఉంది. దేహీ-అభిమానులుగా అయినప్పుడే మాలలోని పూసలుగా అవుతారు. అంతేకాని కేవలం ప్రపంచ చరిత్ర-భూగోళాలను అర్థం చేయించడం వల్లనే మాలలో సమీపంగా రాలేరు. ఆత్మ చాలా చిన్నది. అందులో 84 జన్మల పాత్ర నిండి ఉంది. మొట్టమొదట ఈ విషయాన్ని బుద్ధిలోకి తీసుకు రావాలి. తర్వాత చక్రాన్ని స్మృతి చేయాలి. ముఖ్యమైనది యోగము, యోగస్థితి అవసరము. పాపాత్మ నుండి పుణ్యాత్మగా అవ్వాలి. ఆత్మ యోగము వలన మాత్రమే పవిత్రంగా అవుతుంది. యోగబలము గలవారే ధర్మరాజు శిక్షల నుండి రక్షింపబడ్తారు. ఈ శ్రమ కొంతమంది మాత్రమే చాలా కష్టంగా చేస్తారు. మాయ ద్వారా చాలా తుఫానులు కూడా వస్తాయి. ఇది మనస్ఫూర్తిగా చేయవలసిన గుప్త శ్రమ. లక్ష్మీ-నారాయణులుగా అవ్వడం పిన్నమ్మ ఇంటిలో ఉన్నంత సులభం కాదు. ఇది అభ్యాసమైతే నడుస్తూ-తిరుగుతూ తండ్రి స్మృతి కలుగుతూ ఉంటుంది. దీనినే యోగమని అంటారు. పోతే జ్ఞాన విషయాలు చిన్న-చిన్న పిల్లలు కూడా అర్థము చేసుకుంటారు. చిత్రాలలో అన్ని యుగాలు మొదలైన విషయాల గురించి చూపించబడ్డాయి. ఇది చాలా సాధారణమైన విషయం. ఏదైనా ఒక పనిని ప్రారంభించునప్పుడు స్వస్తిక్ గుర్తును వ్రాస్తారు. ఇది సత్య, త్రేత..... పైన ఉండేది చిన్న సంగమ యుగము. మొదట స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేస్తూ ఉన్నప్పుడే శాంతి వ్యాపిస్తుంది. యోగము ద్వారా వికర్మలు వినాశనమౌతాయి. ప్రపంచమంతా ఆత్మ-పరమాత్మల గురించి

మర్చిపోయింది. కొంతమంది పరమాత్మ వేలాది సూర్యుల కంటే తేజోమయము(హజారోం సూర్యోంసే తేజోమయ్....) అని అంటారు కాని ఇది ఎలా సాధ్యమౌతుంది! ఆత్మనే పరమాత్మ అన్నప్పుడు రెండూ ఒక్కటే అని అర్థము కదా. చిన్న పెద్ద తేడా ఏమీ ఉండదు. దీనిని గురించి కూడా అర్థము చేయించాలి. ఆత్మ రూపము బిందువు. ఆత్మనే పరమాత్మ అయితే పరమాత్మ కూడా బిందువే కదా. ఇందులో తేడా ఏమీ ఉండదు. అందరూ పరమాత్మలే అయితే అందరూ రచయితలే అవుతారు. సర్వుల సద్గతిదాత ఒక్క తండ్రే కదా. పోతే మిగిలిన వారికంతా వారి వారి పాత్రలు లభించాయి. ఇది బుద్ధిలో కూర్చోబెట్టి అర్థము చేయించవలసిన విషయము. తండ్రి అంటున్నారు - నన్ను స్మృతి చేస్తే త్రుప్పు వదిలిపోతుంది. ఇది శ్రమతో కూడిన పని. అర్ధకల్పము నుండి దేహాభిమానులుగా ఉన్నారు. సత్యయుగంలో దేహీ -అభిమానులుగా ఉన్నా తండ్రి గురించి తెలియదు. జ్ఞానము కూడా తెలియదు. ఇప్పుడు మీకు లభించే ఈ జ్ఞానము అదృశ్యమైపోతుంది. అక్కడ కేవలం నేను ఆత్మను, ఒక శరీరాన్ని వదిలి మరొక శరీరాన్ని తీసుకుంటాను అని మాత్రము గుర్తుంటుంది, పాత్రను అభినయిస్తారు. ఇందులో చింతించే విషయము ఏముంది? ప్రతి ఒక్కరు తమ-తమ పాత్రను అభినయించాల్సిందే. ఏడ్చినందున ఏమౌతుంది? అర్థం చేయిస్తే కొద్దిగా తెలుసుకున్నా శాంతి లభిస్తుంది. స్వయం అర్థం చేసుకుంటే, ఇతరులకు కూడా అర్థం చేయిస్తారు. పెద్దవారు ఓదారుస్తూ ఉంటారు, ఏడ్చితే వాపసు వస్తారా ?! అని సముదాయిస్తారు. శరీరము వదిలి ఆత్మ వెళ్ళిపోయింది, ఇందులో ఏడ్చే విషయమేముంది? అజ్ఞానంలో కూడా ఇలాగే భావిస్తారు కాని వారికి ఆత్మ-పరమాత్మల గురించి కొంచెం కూడా తెలియదు. ఆత్మ పై తుప్పు ఏర్పడింది. వారు ఆత్మ నిర్లేపమని భావిస్తారు. ఇవన్నీ చాలా సూక్ష్మమైన విషయాలు. చాలా మంది పిల్లలు స్మృతే చేయరని తండ్రికి తెలుసు. కేవలం తెలియజేసినందున ఏం లభిస్తుంది? చాలా ప్రభావితమైనారని అంటారు. కాని దాని వలన వారికి ఏ మేలూ జరగదు. ఆత్మ - పరమాత్మల గురించి తెలుసుకుంటేనే అప్పుడు మేము వారి పిల్లలమని తెలుసుకుంటారు. ఆ తండ్రే పతితపావనులు. వారు వచ్చి మనలను దుఃఖము నుండి విడిపిస్తారు. వారు కూడా బిందువే, తండ్రిని నిరంతరము స్మృతి చేయాల్సి వస్తుంది. చరిత్ర-భూగోళాలను తెలుసుకోవడం పెద్ద విషయము కాదు. భలే తెలుసుకునేందుకు వస్తారు కాని నేను ఆత్మను అనే స్థితిలో తత్పరులై ఉండాలి. ఇందులోనే శ్రమ ఉంది. ఆత్మ-పరమాత్మల విషయము మీకు కూడా తండ్రే వచ్చి అర్థము చేయిస్తారు. సృష్టి చక్రమైతే చాలా సులభము. కూర్చుంటూ లేస్తూ వీలైనంత ఎక్కువ సమయము ఆత్మాభిమానిగా ఉండేందుకు శ్రమ చేయాలి. దేహీ-అభిమానులు చాలా శాంతిగా ఉంటారు. సైలెన్స్‌లోనికి వెళ్ళాలని వారికి తెలుసు. నిరాకార ప్రపంచములో విరాజమానమవ్వాలి. ఇప్పుడు మన పాత్ర పూర్తి అయింది. తండ్రి రూపము చిన్న బిందువు అని అర్థము చేసుకుంటారు. వారు పెద్ద శివలింగమేమీ కాదు, బాబా చాలా చిన్నగా ఉంటారు. వారే సర్వుల సద్గతిదాత. వారే జ్ఞాన సాగరులు. ఆత్మనైన నేను కూడా ఇప్పుడు జ్ఞాన సంపన్నంగా అవుతున్నాను ఇటువంటి చింతన జరిగితే ఉన్నత పదవి పొందుతారు. ప్రపంచములోని వారెవ్వరికీ ఆత్మ - పరమాత్మల గురించి తెలియదు.

బ్రాహ్మణులైన మీరిప్పుడు అర్థం చేసుకున్నారు. సన్యాసులకు కూడా తెలియదు, వారు వచ్చి అర్థము చేసుకోరు కూడా. వారందరు వారి వారి ధర్మాలలోనే వస్తారు. లెక్కాచారము పూర్తి చేసుకొని వెళ్ళిపోతారు. శ్రమ చేస్తే మీకు మాత్రమే తండ్రి నుండి వారసత్వము లభిస్తుంది. ఇప్పుడు మళ్ళీ దేహీ - అభిమానులుగా అవ్వాలి. మనస్సు(దిల్) ఆత్మలో ఉంది కదా. మనస్సును తండ్రితో జోడించేది

ఆత్మనే కదా. మనసు శరీరములో లేదు. శరీరములో స్థూల అవయవాలన్నీ ఉన్నాయి. మనసును జోడించడం ఆత్మ చేయాల్సిన పని. స్వయాన్ని ఆత్మగా భావించి పరమాత్మ తండ్రితో మనస్సును జోడించాలి. ఆత్మ చాలా సూక్ష్మమైనది. ఎంతో చిన్న ఆత్మ ఎంత పెద్ద పాత్రను అభినయిస్తుంది! ఇది ప్రాకృతికము. ఇంత చిన్న ఆత్మలో ఎంతో అవినాశి పాత్ర నిండి ఉంది. అది ఎప్పుడూ నశించేది కాదు, చాలా సూక్ష్మమైనది. మీరు ఎంత ప్రయత్నించినా పెద్ద వస్తువే గుర్తుకు వస్తుంది, నేను ఆత్మ చిన్న నక్షత్రాన్ని. తండ్రి కూడా చాలా చిన్నగా ఉంటారు. పిల్లలైన మీరు మొట్టమొదట ఈ శ్రమ చేయాలి. ఇంత చిన్న ఆత్మనే ఇప్పుడు పతితమై ఉంది. ఆత్మను పావనంగా తయారు చేసుకునేందుకు ఇది మొట్టమొదటి ఉపాయము. చదువు చదువుకోవాలి. పోతే ఆట పాటలన్నీ వేరే విషయాలు. ఆడుకోవడం కూడా ఒక నైపుణ్యమే. చదువు ద్వారా పదవి లభిస్తుంది. ఆట పాటల ద్వారా పదవి లభించదు. ఆటలు మొదలైన డిపార్ట్‌మెంట్లు వేరుగా ఉంటాయి. ఆటలకు, జ్ఞాన-యోగాలకు సంబంధము లేదు. భోగ్ పెట్టడం మొదలైనవి కూడా ఒక ఆటనే. ముఖ్యమైనది స్మృతి. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. ధర్మరాజు శిక్షల నుండి రక్షించుకునేందుకు స్మృతి అను గుప్త శ్రమ చేయాలి. స్వయాన్ని ఆత్మ బిందువు అని భావిస్తూ బిందువైన తండ్రిని స్మృతి చేయడమే పవిత్రంగా అయ్యే ఉపాయము.
2. జ్ఞానంలో నాకు అంతా తెలుసు అని అనుకోరాదు. ఏకరస అవస్థను తయారు చేసుకొను అభ్యాసము చేయాలి. తండ్రి ఆజ్ఞను పాటించాలి.

వరదానము :- “సత్యత మరియు శుభ్రతల ధారణ ద్వారా సమీపతను అనుభవం చేసే సంపూర్ణ మూర్త్ భవ ”

అన్ని ధారణలలో ముఖ్యమైన ధారణ సత్యత మరియు శుభ్రత. ఒకరి పట్ల ఒకరికి హృదయంలో పూర్తి స్వచ్ఛత ఉండాలి. ఎలాగైతే శుభ్రమైన వస్తువులో అన్నీ స్పష్టంగా కనిపిస్తాయో, అలా పరస్పర భావనలు, భావ-స్వభావాలు స్పష్టంగా కనిపించాలి. ఎక్కడైతే సత్యత-శుభ్రత ఉంటాయో అక్కడ సమీపత ఉంటుంది. ఎలాగైతే బాప్‌దాదాకు సమీపంగా ఉన్నారో అలా పరస్పరం కూడా హృదయాలలో సమీపంగా ఉండాలి. స్వభావాలలో భిన్నత సమాప్తమైపోవాలి. అందుకు మనోభావాలు మరియు స్వభావాలను కలుపుకోవాలి. ఎప్పుడైతే స్వభావాలలో తేడా కనిపించదో అప్పుడు సంపూర్ణ మూర్తులని అంటారు.

స్లోగన్ :- “ చెడిపోయిన దానిని బాగు చేయడమే అన్నిటికంటే పెద్ద సేవ.”